

ప్రభుత్వ భూమి కబ్జా

రెండు రోజులుగా ఐదెకరాలు చదును

- ఇతరులకు లీజుకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసిన అక్రమార్కులు



ఎరకన్నపాలెంలోని సర్వే నంబరు 737లో ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

మాకవరపాలెం, జూన్ 8: ప్రభుత్వ భూముల ఆక్రమణల దందా కొనసాగుతోంది. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ అక్రమార్కులు వాలిపోతున్నారు. ఫిర్యాదులు వస్తేనే గానీ అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో రూ.కోట్ల విలువైన స్థలాలు పరాధీనమైపోతున్నాయి. ఈ క్రమంలో మాకవరపాలెం మండలం సర్వే నంబరు 737 సర్వేలో ఉన్న సుమారు ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోంది. రాచపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 1,400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని సరిహద్దులపై ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల మధ్య వివాదం కొనసాగుతోంది. ఇదే అదనుగా ఎరకన్నపాలెం గ్రామానికి ఆనుకుని ఉన్న 737 సర్వే నంబరులో సుమారు ఐదె ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు గత రెండు రోజులుగా యంత్రాలతో చదును చేస్తున్నారు. ఇందులో భాగంగా కొండ గెడ్డలను కూడా కలిపేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కాగా గ్రామానికి చెందిన కొంతమంది ఈ భూమిని చదును చేసి, బయటి వ్యక్తులు ఇక్కడ సరుగుడు తోటల పెంపకం చేపట్టేందుకు లీజుకు ఇచ్చారని సమాచారం. ఈ క్రమంలోనే ఐదు ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లతో భూమిని చదును చేస్తున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దీనిపై డిప్యూటీ తహసీల్దార్ శంకరరావును వివరణ కోరగా సర్వే నంబరు 737లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్టు తన దృష్టికి రాలేదన్నారు. వీఆర్వోతో విచారణ చేపట్టి, ఆక్రమణకు గురైతే నిందితులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వివరించారు.



ట్రాక్టర్లతో చదును చేయిస్తున్న దృశ్యం

భూ సమీకరణలో మాయాజాలం..!

రూ.కోట్లు విలువైన భూములు హాంఫట్

- మంత్రి అండతో వైసీపీ నేతల అక్రమాలు
- లబ్ధిదారుల జాబితాలో బినామీలు
- వత్తాసు పలికిన రెవెన్యూ అధికారులు
- నిజమైన రైతులకు దక్కని ప్లాట్లు
- సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నేతలు
- విచారణ జరిపి న్యాయం చేయాలంటున్న బాధితులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మరో భారీ భూదందా వెలుగులోకి వచ్చింది. జగనన్న లేఅవుట్‌లు వేసి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే ఉద్దేశంతో వైసీపీ ప్రభుత్వం పెద్దఎత్తున భూసమీకరణ జరిపింది. ఈ క్రమంలో పేదల నుంచి రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూముల గోల్‌మాల్ జరిగినట్టు తెలుస్తోంది. అప్పటి మంత్రి అనుచరులతో రెవెన్యూ అధికారులు ఏకమై రైతులకు ప్రతిగా అందజేయాల్సిన లేఅవుట్‌లను బినామీలు, నకిలీలకు కేటాయించినట్టు సమాచారం. గుట్టుగా సాగిన భూ సమీకరణ మాయాజాలంపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, రైతులు గతంలో సీఐడీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు కనిపించలేదు.



రొంగలివానిపాలెంలో రైతుల నుంచి సమీకరించిన భూములు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2020 మే 25న జగనన్న లే అవుట్‌ల కోసం భూ సమీకరణ చేపట్టేందుకు వీలుగా వైసీపీ ప్రభుత్వం జీవో నంబరు 72ను విడుదల చేసింది. అనకాపల్లి మండలంలోని 13 గ్రామాల్లో సుమారు 1,138 ఎకరాలను భూ సమీకరణ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో సగానికిపైగా డీపట్టా భూములే ఉన్నాయి. ఎక్కువగా ఎస్సీ, బీసీలకు ప్రభుత్వాలు కేటాయించిన భూములను సమీకరించారు. ఆయా భూముల్లో జగనన్న లేఅవుట్‌లు వేసి, పేదలకు స్థలాలను కేటాయించారు.

చక్రం తిప్పిన వైసీపీ నేతలు

భూ సమీకరణను తమకు అనుకూలంగా మలచుకున్న వైసీపీ నాయకులు మంత్రి అండదండలతో అక్రమాలకు తెరలేపారు. అనకాపల్లి మండలం కోడూరు, గొలగాం, గోపాలపురం, గొల్లలపాలెం, పాపయ్యసంతపాలెం, పాపయ్యపాలెం, మామిడిపాలెం, పిసినికాడ, సత్యనారాయణపురం, సంపతపురం, వేటజంగాలపాలెం, కుంచంగి, కూండ్రం రెవెన్యూ గ్రామాల పరిధిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అధీనంలో ఉన్న సుమారు 920 ఎకరాల భూములను సమీకరించారు. అయితే భూములిచ్చిన నిజమైన రైతులకు ప్రతిగా అధికారులు లేఅవుట్‌లు వేసి ప్లాట్‌లు ఇవ్వలేదు. వారంతా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. భూములు తీసుకొని ప్రతిగా అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో ప్లాట్‌లు కేటాయించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నిస్తే, రేపు మాపు అంటూ కాలం వెళ్లదీశారు. దీంతో ఏం చేయాలో తెలియక బాధితులంతా అనేక పర్యాయాలు తామిచ్చిన భూముల వద్ద టెంట్లు వేసి ఆందోళనలు చేపట్టారు. దీంతో 2023 నవంబరు ... మిగతా 6వ పేజీలో



అనకాపల్లి మండలం కుంచంగిలో పరిహారం చెల్లించాలని నిరసన తెలుపుతున్న బాధితులు (ఫైల్ ఫొటో)

కుర్చీలు వదలని వైసీపీ నేతలు

పార్టీ ఓటమి పాలైనా నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయని వైనం

- ఈ జాబితాలో ఏపీ మేరీటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, పీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్...
- ఇంకా వర్సిటీల డైరెక్టర్లు, దేవస్థానాల ట్రస్ట్ బోర్డు సభ్యులు
- అవే రద్దు అయిపోతాయంటూ వ్యాఖ్యలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నాయకులకు ఇంకా అధికార దాహం తీరలేదు. సాధారణ ఎన్నికల్లో పార్టీ చిత్తుగా ఓడిపోయినా నామినేటెడ్ పోస్టుల్లో ఉన్నవారు రాజీనామా చేయలేదు. ప్రభుత్వమే రద్దు చేస్తుందని, తాము ప్రత్యేకంగా రాజీనామా చేయడం ఎందుకని పశ్నిస్తున్నారు.



చంద్రమౌళి వీఎంఆర్‌డీఏ చైర్మన్



చొక్కాకుల వెంకటరావు (పీసీపీఐఆర్) చైర్‌పర్సన్



కాయల వెంకటరెడ్డి ఏపీ మారీటైమ్ బోర్డు చైర్మన్



కొండా రాజీవ్‌గాంధీ విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్మన్

వైసీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులను పెద్దఎత్తున కట్టబెట్టింది. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వారి దగ్గర నుంచి ఓ మోస్తరు నాయకులంతా పైరవీలు చేసి పదవులు సంపాదించుకున్నారు. కొందరికి మంచి ఆదాయం సమకూరే పదవులే ఇచ్చారు. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్‌గా ఐదేళ్లలో ముగ్గురికి అవకాశం ఇచ్చారు. మొదట ద్రోణంరాజు శ్రీనివాస్‌కి ఇచ్చారు. ఆ తరువాత తూర్పు నియోజకవర్గ నాయకురాలు అక్కరమాని విజయనిర్మలను కూర్చోబెట్టారు. ఆ తరువాత ఎన్నికలకు మూడు నెలల ముందు సనపల రాజమౌళికి ఆ కుర్చీ అప్పగించారు. వైసీపీ నాయకులు వారి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా లేఅవుట్లకు సంబంధించిన పనులన్నీ వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా పనిచేసిన వారితో చక్కగా చేయించుకున్నారు. కొత్తగా రూపొందించిన వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఎంపీ విజయసాయిరెడ్డి, ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు, చిన్న శ్రీను తదితరులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ప్రస్తుత చైర్మన్ సనపల నగరంలో లేరు. అయితే అధికారులు ముందుగానే రాజీనామా లేఖను సిద్ధం చేసి పెట్టుకున్నట్టు సమాచారం. ఆయన రాగానే సంతకం చేయించుకోవాలని చూస్తున్నారు.

కాయల వెంకటరెడ్డికి ఏపీ మేరీటైమ్ బోర్డు చైర్మన్ పదవి ఇచ్చారు. ఒకసారి పదవీ కాలం ముగిసిపోగా మరోసారి పొడిగింపు ఇచ్చారు. వివిధ సంస్థల నుంచి బోర్డు పేరుతో రుణాలు తెచ్చి ప్రభుత్వ ఖాతాలకు మళ్లించడంలో ఆయన కీలక పాత్ర పోషించారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కరోజు కూడా ఆ సంస్థ ప్రగతిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయలేదు. ఆయన ఇంకా పదవికి రాజీనామా చేయలేదు.

విశాఖపట్నం-కాకినాడ పెట్రో రసాయన ... మిగతా 7వ పేజీలో

మహిళలకు ఉచిత ప్రయాణం

ఆర్టీసీ ఏర్పాట్లు
విశాఖ రీజియన్‌లో 579 బస్సుల్లో అనుమతి

- సిటీ ఆర్డినరీ, పల్లెవెలుగు, మెట్రో, జేఎన్ఎన్‌యూఆర్ఎం సర్వీసులలో అవకాశం
- ప్రస్తుతం రోజుకు 80 వేల మంది ప్రయాణం
- ఈ సంఖ్య లక్షకు చేరుకుంటుందని అంచనా
- అందుకు అనుగుణంగా బస్సుల పెంపునకు అధికారుల సన్నాహాలు



విశాఖపట్నం, జూన్ 8:

మహిళా ప్రయాణికులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన బస్సులు ఏర్పాటు, టికెట్ ఇష్యూ మెషీన్ (టిమ్) సాఫ్ట్‌వేర్ లోడింగ్, మహిళా ప్రయాణికుల డిమాండ్ ఉన్న రూట్ల గుర్తింపు, ఆయా రూట్లలో బస్సులు పెంపు వంటి వాటిపై దృష్టిపెట్టారు. తాము అధికారంలోకి వస్తే బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం ఇస్తామని తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. ఈ మేరకు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఉత్తర్వులు వెలువడవచ్చునని ఆర్టీసీ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

విశాఖ రీజియన్‌కు సంబంధించి ఐదు రకాలకు చెందిన 579 బస్సుల్లో జీరో చార్జీ టికెట్‌తో మహిళలు ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని అధికారులు నిర్ణయించారు. సిటీ ఆర్డినరీ (285 బస్సులు), పల్లెవెలుగు (3), సిటీ ఎక్స్‌ప్రెస్ (28), మెట్రో (125), జేఎన్ఎన్‌యూఆర్ఎం సిటీ సర్వీసులు (138)లలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. విభజిత విశాఖ జిల్లాలోని పలు డిపోల్లో 721 బస్సులు ప్రయాణికులకు రవాణా సేవలందిస్తున్నాయి. ఇందులో గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, ఆల్ట్రా డీలక్స్, మెట్రో ఏసీ సర్వీసులు 142 ఉన్నాయి. వీటిలో మహిళలు జీరో టికెట్‌తో ప్రయాణించే అవకాశం లేదు. మిగిలిన 579 బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునని అధికారులు వెల్లడించారు.

ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం వల్ల మహిళా ప్రయాణికులు పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా బస్సుల సంఖ్య పెంచుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి నివేదించారు. విశాఖ రీజియన్ అధికారుల లెక్కల ప్రకారం రీజియన్‌లో ప్రతిరోజూ 1.8 లక్షల ... మిగతా 6వ పేజీలో

ఆధార్ కార్డు తప్పనిసరి

ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్‌తో ప్రయాణించదలచిన మహిళలు తప్పనిసరిగా ఆధార్ కార్డు కలిగి ఉండాలి. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన మహిళలు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అర్హులు. ఇతర రాష్ట్రాలకు చెందిన మహిళలు ఇక్కడ ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం లేదు. బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కోరుకునే మహిళలు స్థానిక చిరునామాతో కూడిన ఆధార్ కార్డును జీరో టికెట్ తీసుకునే సమయంలో కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది.



నేటి నుంచి మోదకొండమ్మ ఉత్సవాలు

శతకంపట్టులో అమ్మవారి ప్రతిష్ఠతో శ్రీకారం

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

గిరి పుత్రుల ఆరాధ్య దేవతమోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. పాడేరులో మూడు రోజులు జరిగే ఉత్సవాలకు గిరిజన ప్రాంత నివాసితులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మోదకొండమ్మను అత్తవారింటి నుంచి పుట్టింటికి తోడ్కొని వచ్చే తంతుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. స్థానిక ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను ఆదివారం ఉదయం తీసుకువచ్చి పుట్టిల్లుగా భావించే శతకంపట్టులో ప్రతిష్ఠిస్తారు. ఇక్కడ మోదకొండమ్మ కొలువుదీరడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా భక్తులు ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. మిగిలిన రెండు రోజులు ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. మూడోరోజు శతకంపట్టులో కొలువుతీరిన అమ్మవారిని తిరిగి ఆలయంలో చేర్చడం (అనుపోత్సవం)తో ఉత్సవాలు ముగుస్తాయి. ఆరోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి పట్టణవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

హైవేపై ఆశలు!

సబ్బవరం నుంచి చోడవరం మీదుగా మల్కన్‌గిరి వరకు జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు



రూపురేఖలు మారనున్న చోడవరం సబ్బవరం ప్రధాన రహదారి

- టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1900 కోట్లతో అంచనా
- 286కి.మీ రహదారి నిర్మాణానికి సిద్ధమైన డీపీఆర్
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అటకెక్కిన ప్రాజెక్టు
- కూటమి ప్రభుత్వంలో మోక్షం దక్కుతుందంటున్న స్థానికులు

చోడవరం, జూన్ 8:

జాతీయ రహదారి నిర్మాణంపై స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సబ్బవరం నుంచి చోడవరం, నర్సీపట్నం మీదుగా మల్కన్‌గిరి వరకు హైవే నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీజం పడినా... వైసీపీ ఆ ప్రాజెక్టును పట్టించుకోకపోవడంతో మోక్షం లభించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రహదారి నిర్మాణానికి అనుమతులు లభించే అవకాశాలున్నాయని ఈ ప్రాంత వాసులు భావిస్తున్నారు.



చోడవరం పట్టణ రహదారిలో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విశాఖ సాగరతీర ప్రాంతాన్ని ఏజెన్సీతో అనుసంధానించే ప్రతిష్ఠాత్మక జాతీయ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సబ్బవరం నుంచి చోడవరం- నర్సీపట్నం మీదుగా ఒడిశాలోని మల్కన్‌గిరి వరకూ నాలుగులేన్ల రహదారి నిర్మాణానికి 2014లోనే ప్రతిపాదనలు రూపొందించారు. గ్రామీణ ప్రాంత రహదారులను అభివృద్ధి పరిచే ప్రక్రియలో భాగంగా ఈ రహదారి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఓ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీతో సర్వే చేయించి, డీపీఆర్ రూపొందించారు. మొత్తం 286 కిలోమీటర్ల మేర నాలుగులేన్ల రహదారి నిర్మాణానికి రూ.1900 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలతో ప్రాజెక్టును సిద్ధం చేశారు. రహదారి నిర్మాణంలో సబ్బవరం నుంచి నర్సీపట్నం వరకూ మధ్యలో జనావాసాలు ఉన్న చోడవరం, తదితర ముఖ్యప్రాంతాలలో బైపాస్ నిర్మాణాలపై కసరత్తు చేసి నివేదికలు సిద్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి డీపీఆర్ పంపడంతో అంతా సంబరపడ్డారు.

వైసీపీ రాకతో గోల్‌మాల్

అయితే ఆ తరువాత రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో రహదారి నిర్మాణంపై నీలినీడలు అలముకున్నాయి. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి తెలుగుదేశం బయటకు రావడం, బీజేపీతో దూరం పెరగడంతో మోక్షం లభించలేదు. ఇక 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ జాతీయ రహదారి నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వడానికే పరిమితం కావడంతో అంగుళం కూడా ముందుకు పడలేదు. ప్రస్తుతం అనకాపల్లి నుంచి బీజేపీకి చెందిన సీఎం రమేశ్ ఎంపీగా ఎన్నిక వడం, రెండుచోట్లా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు ... మిగతా 6వ పేజీలో

లెఫ్టినెంట్ అధికారిగా గోవింద్

- గంపవానిపాలెం వాసికి అవకాశం
- ఆరునెలల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లోకి

నర్సీపట్నం, జూన్ 8:

ఇండియన్ ఆర్మీలో సాధారణ జవాన్ స్థాయి నుంచి సీఎల్-1 స్పెషల్ ఆఫీసర్ (లెఫ్టినెంట్)గా పదోన్నతి సాధించాడు జిల్లాకు చెందిన విజనగిరి గోవింద్. రావికమతం మండలం జెడ్ కొత్తపట్నం పంచాయతీ గంపవానిపాలెం గ్రామానికి చెందిన విజనగిరి రాజారావు, రాజ్యలక్ష్మీల కుమారుడు గోవింద్ 2011లో ఆర్మీ ఎలక్ట్రానిక్స్ మెకానికల్ ఇంజనీర్స్ విభాగంలో క్లర్క్ (జవాన్)గా విధుల్లో చేరారు. 13 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత 2023 మార్చిలో బెంగళూరులో నిర్వహించిన ఎస్ఎస్‌బీ (సర్వీస్ సెలక్షన్ బోర్డు) ఇంటర్వ్యూలో ఇండియన్ ఆర్మీ స్పెషల్ ఆఫీసర్స్ విభాగంలో సీఎల్-1 స్పెషల్ కమిషన్ ఆఫీసరు (లెఫ్టినెంట్)గా ఎంపికయ్యారు. బిహార్ రాష్ట్రంలోని గయాలో ఆర్మీ ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ఆరు నెలలు శిక్షణ పూర్తిచేసుకుని శనివారం ఇంటికి వచ్చారు. కుటుంబసభ్యుల సమక్షంలో ఇండియన్ ఆర్మీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. లెఫ్టినెంట్ హోదాలో రాజస్థాన్‌లోని బార్మర్‌లో విధులు నిర్వర్తించనున్నారు.



కుటుంబసభ్యులతో ఆర్మీ లెఫ్టినెంట్ అధికారి విజనగిరి గోవింద్

పెదపల్లిలో జనసేనకు ఆధిక్యం

» పందెంలో రూ.3 లక్షలు పోగొట్టుకున్న వైసీపీ అభిమాని

ఎలమంచిలి, జూన్ 8 : మునిసిపాలిటీలో రాజకీయ ప్రాధాన్యత కలిగి పెదపల్లి వార్డులో ఊహించని రీతిలో జనసేనకు ఆధిక్యత లభించింది. ఈ వార్డు వైసీపీ ఓటు బ్యాంకుగా ముద్ర పడింది. సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత ఈ వార్డులో ఓ వ్యక్తి జనసేన అభ్యర్థి కంటే వైసీపీ అభ్యర్థికి ఒక్క ఓటు అయినా మెజారిటీ వస్తుందని రూ. 3 లక్షలు పందెం వేసి కోల్పోయాడు. పెదపల్లి వార్డులోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో కలిపి 2,986 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీటిలో జనసేన అభ్యర్థికి 1,611 ఓట్లు రాగా, వైసీపీ అభ్యర్థికి 1,230 ఓట్లు దక్కాయి. జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు 381 ఓట్లు మెజారిటీ లభించడం విశేషం. వైసీపీ ఆధిక్యత కనబరుస్తున్న ఈ వార్డులో జనసేనకు మెజారిటీ రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పెందుర్తిలో నోటాకు నాల్గో స్థానం

పరవాడ, జూన్ 8 : సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గంలో నోటాకు నాల్గో స్థానం వచ్చింది. ఈ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలతో సహా స్వతంత్ర అభ్యర్థులు 14 మంది పోటీలో ఉన్నారు. కూటమి, వైసీపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తర్వాత ఎక్కువ ఓట్లు నోటాకు రావడం గమనార్హం. కూటమి అభ్యర్థి జనసేనకు 1,49,611 ఓట్లు, వైసీపీకి 67,742 ఓట్లు, కాంగ్రెస్‌కు 4,224 ఓట్లు రాగా నోటాకు 2,834 ఓట్లతో నాల్గో స్థానంలో నిలిచింది. స్వతంత్ర అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు పోలయ్యాయి.

డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు, జూన్ 8 : స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం ఆనర్స్ జనరల్‌లో 240 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీలో 150, బాటనీ ఆనర్స్‌లో 50, బి.ఒకేషనల్ అగ్రికల్చర్ ఆనర్స్‌లో 50, బి. ఒకేషనల్ యానిమల్ హస్బండరీ ఆనర్స్‌లో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వీరాంజనేయస్వామి జయంతి వేడుకలు

అనకాపల్లి టౌన్, జూన్ 8 : స్థానిక జాతీయ రహదారి తోటాడ జంక్షన్ వద్ద కొలువైన వీరాంజనేయస్వామి జయంతి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజామున స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. వేడుకల్లో దాడి రత్నాకర్ పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కొణతాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని రత్నాకర్ ప్రారంభించారు.

పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

తుమ్మపాల, జూన్ 8 : పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని సీపీఐ నాయకుడు కోన లక్ష్మణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా అవస్థలు పడుతున్నారన్నారు. కుటుంబాలు నెట్టుకు రావడం భారంగా మారిందన్నారు. తక్షణమే బకాయి పడ్డ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పెందుర్తి యునైటెడ్ క్రిస్టియన్ సొసైటీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

సబ్బవరం, జూన్ 8: పెందుర్తి నియోజకవర్గం యునైటెడ్ క్రిస్టియన్ సొసైటీ అధ్యక్షుడిగా స్థానిక గ్రేస్ ఆఫ్ గాడ్ చర్చి ఫాదర్ పువ్వల విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం రెవ.పి.పాల్‌రాజ్ అధ్యక్షతన ఇక్కడ జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.జోషువా, కార్యదర్శిగా సి.జాన్‌రత్నం, కోశాధికారిగా వి.మనోహర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ బి. వరప్రసాద్, ఈఎస్.ప్రకాష్, సీహెచ్ జయరాజు, డి. స్టీవెన్, వి. జాన్‌సన్ ఆర్నాల్డ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన రామోజీరావు

» అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, జూన్ 8 : తెలుగుభాషను, తెలుగుజాతిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని అనకాపల్లి శాసనసభ్యుడు కొణతాల రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు భాష ఉన్నతిని కాపాడారని కొనియాడారు. పత్రికా రంగ విలువలను కాపాడడమే కాకుండా దేశంలో తమకంటూ ఒక ప్రత్యేకతను సొంతం చేసుకున్నారన్నారు. ఎన్నో సంస్థలు ఏర్పాటు చేసి ఎందరికో ఉపాధి కల్పించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికే కాకుండా దేశానికి తీరని లోటని, వారి కుటుంబానికి, అభిమానులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విజేతలకు అభినందన వెల్లువ



పంచకర్లకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న సాలాపు మీన, వెంకటేశ్వరరావు



బండారుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టీడీపీ మండల నాయకులు



ఎమ్మెల్యే సుందరపును అభినందించిన బ్రాండిక్స్ ఇండియా ప్రతినిధి దొరస్వామి

సబ్బవరం, జూన్ 8: ఎన్నికల్లో గెలుపొందిన శాసనసభ్యులకు కూటమి నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును శనివారం పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో గొటివాడ సర్పంచ్ సాలాపు మీన, సీనియర్ నేత సాలాపు వెంకటేశ్వరరావు, బంతికోళ్ల పద్మ, గొర్లి కుమార్, టి. శేఖర్, జెట్టి ప్రసాద్ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును పూలగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావును బర్ల రమణ, బలిరెడ్డి సూర్యప్రసాద్, అక్కుబాబు, బాదిరెడ్డి సత్యనారాయణ, పెద్దాడ రమణమ్మ అభినందనలు తెలిపారు.

బండారుకు..

పరవాడ: మాడుగుల ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యనారాయణమూర్తిని పరవాడ టీడీపీ నాయకులు శనివారం వెన్నెలపాలెంలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బండారుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పైలా రామచంద్రరావు, పైలా సన్యాసినాయుడు, గండి లక్ష్మి, బండారు రవికుమార్, పిళ్లా జగదీష్, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'సుందరపు'నకు..

అచ్యుతాపురం రూరల్: జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులను కలిసి సన్మానించారు. తన గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన టీడీపీ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావును అచ్యుతాపురంలోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. అలాగే బ్రాండిక్స్ ఇండియా ప్రతినిధి దొరస్వామి అచ్యుతాపురంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను సత్కరించారు. అలాగే దిమిలిలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావును టీడీపీ మండల నాయకులు సత్కరించారు.



ప్రగడను సన్మానించిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

వాడనర్సాపురంలో..

రాంబిల్లి: ఎన్నికల్లో రాష్ట్రంలోను, ఎలమంచిలి నియోజకవర్గంలోను కూటమి విజయం సాధించడంతో మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో శనివారం కూటమి శ్రేణులు విజయోత్సవాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా స్వర్గీయ ఎన్‌టీ.రామారావు విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి, పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సూరాడ దేముడు, సూరాడ రాంబాబు, చెల్లూరి దేముడు, సూరాడ అప్పలరాజు, బోడిపల్లి ప్రసాద్, కోడ శ్రీను, కె.రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి



నెహ్రూచౌక్‌లో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పీలా గోవింద



టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగజగదీష్

తుమ్మపాల, జూన్ 8 : ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావుకు శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే అనకాపల్లి నెహ్రూచౌక్‌లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆ పార్టీ నాయకులతో కలిసి రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు కొణతాల వెంకటరావు, బొడ్డేడ మురళీ, మళ్ల గణేష్, బుద్ద కాశీ, కుప్పిలి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో.. అనకాపల్లి జనసేన కార్యాలయంలో ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావుకు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా అంజలి ఘటించారు. రామోజీరావు చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, భీమరశెట్టి చిన్నికృష్ణ, దూలం గోపి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు బొడ్డేడ జోగినాయుడు, బుద్ద రాజేష్, రామకృష్ణ, కరణం శ్రీనివాసరావు, శేషు, గల్లా కొండలరావు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు మృతి చెందడం అందరినీ తీవ్ర మనోవేదనకు గురిచేసిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అన్నారు. శనివారం డీవీఆర్ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి రత్నాకర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేగి దొరబాబు, జెర్రిపోతుల ధర్మారావు, యల్లపు శ్రీనివాస్, బొడ్డపాటి చినరాజారావు, రేబాక ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. ఈనాడు సంస్థల అధినేతగానే కాకుండా, అన్ని రంగాల్లోనూ అపూర్వమైన విజయం సాధించిన రామోజీరావు ఎందరికో ఆదర్శప్రాయుడని టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ నాయకులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డూరి లోవరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో.. ఈనాడు సంస్థల అధినేత, పద్మవిభూషణ్ రామోజీరావు మృతి తీరని లోటని పూడిమడక టీడీపీ నాయకులు మేరుగు బాపునాయుడు అన్నారు. మండలంలోని పూడిమడకలో శనివారం రామోజీరావు చిత్రపటానికి ఆయన, టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

పాయకరావుపేటలో.. ఈనాడు సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు మృతి పట్ల శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రామోజీరావు చిత్రపటానికి టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మలిపెద్ది వెంకటరమణ, బత్తిన అచ్చిరాజు, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, దంతులూరి నాగు, మేములపూడి అప్పారావు, కట్టా శ్రీను, సీహెచ్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రత్నాకర్, టీడీపీ నాయకులు



నక్కపల్లిలో రామోజీరావుకి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మహిళలకు ఉచిత ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, ఆల్ట్రా డీలక్స్, మెట్రో ఏసీ, వంటి సర్వీస్‌లలో 20 వేల మంది ప్రయాణిస్తున్నారు. సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, జెఎన్ఎన్‌యూఆర్ఎం సర్వీసుల్లో 1.6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 80 వేల మంది వరకూ మహిళలు ఉంటారని అధికారుల అంచనా. ఐదు రకాల సర్వీస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తే ఆ సంఖ్య లక్షకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా. అందుకు తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచుకోవలసిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

అన్ని రూట్లలోను బస్సులుండాలి

మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వీలుగా అన్ని రూట్లలోను బస్సులు ఉండాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఇప్పటికే అన్ని రీజియన్‌లకు ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటివరకూ ఆదాయానికి అనుగుణంగా ఆక్యుపెన్సీ అధికంగా ఉన్న రూట్లలో ఎక్కువ బస్సులు, తక్కువగా ఉన్న రూట్లలో తక్కువ బస్సులు నడిపేవారు. కానీ ఇప్పుడు మహిళా ప్రయాణికుల కేంద్రంగా రూట్లలో డిమాండ్ మేరకు బస్సులు కేటాయిస్తూ షెడ్యూలింగ్ చేయాల్సి అవసరం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

హైవేపై ఆశలు!

... 5వ పేజీ తరువాయి

పట్టాలెక్కుతుందని భావిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో సబ్బవరం నుంచి చోడవరం-నర్సీపట్నం వరకూ 55 కిలోమీటర్ల మేర బైపాస్‌ల నిర్మాణాలు చేపట్టాలని తేల్చారు. నర్సీపట్నం సమీపంలోని చెట్టుపల్లి -వెలంకాయలపాలెం వద్ద 4.1 కిలోమీటర్లు, రోలుగుంట వద్ద 1.15 కిలోమీటర్లు, దొండపూడి- కొత్తకోట మధ్య 5.8 కిలోమీటర్ల బైపాస్, మేడివాడ-రావికమతం వద్ద 5.2 కిలోమీటర్లు, బంగారుమెట్ట నుంచి వడ్డాది మీదుగా చోడవరం గోవాడ వరకూ 14.2 కిలోమీటర్ల బైపాస్, లింగాలతిరుగుడు- ఆరిపాకల మధ్య 2.7 కిలోమీటర్లు, సబ్బవరం నార్త్ బైపాస్‌కు 6.1 కిలోమీటర్లు, సబ్బవరం సౌత్ బైపాస్‌కు 2.6 కిలోమీటర్లు, నర్సీపట్నం బలిఘట్టం వద్ద 5.9 కిలోమీటర్లు, శృంగవరం వద్ద 1.4 కిలోమీటర్లు, కోటనందూరు వద్ద 2.2 కిలోమీటర్లు, డి.పోలవరం వద్ద 1.63 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణాలు చేపట్టాలని అప్పట్లోనే రూపకల్పన చేశారు.

1,235 ఎకరాల సేకరణకు నివేదిక

జాతీయ రహదారి నిర్మాణానికి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అటవీప్రాంతంలో 1,235 ఎకరాల భూములు సేకరించాలని అధికారులు ప్రతిపాదించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో చర్యలు చేపట్టలేదు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుకు మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు.

భూ సమీకరణలో మాయాజాలం..!

... 5వ పేజీ తరువాయి

డిసెంబరు నెలల్లో కొందరికి ప్లాట్‌లు కేటాయించి చేతులు దులుపుకున్నట్టు తెలిసింది.

వైసీపీ నేతల చేతివాటం

సమీకరణలో భూములు కోల్పోయిన రైతుల జాబితాలో వైసీపీ నేతలు బినామీల పేర్లను చేర్చి, పెద్దఎత్తున లబ్ధిపొందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి మండలం కోడూరు, కుంచంగి, కూండ్రం, గోపాలపురం, మామిడిపాలెం గ్రామాల్లో అధికార పార్టీ నేతలతో కలిసిపోయిన రెవెన్యూ అధికారులు భూములు లేకుండానే బినామీల పేరుతో లేఅవుట్‌లలో ప్లాట్‌లు పొందేందుకు వీలుగా జాబితాలు రూపొందించారని సమాచారం. అర్హులైన రైతుల జాబితాలను గ్రామ సభల్లో ప్రకటించిన తరువాత సచివాలయాల్లో నోటీసు బోర్డులపై అతికించాలన్నది నిబంధన. కానీ అర్హుల జాబితాను ప్రకటించకుండానే ప్లాట్లు కేటాయించినట్టు తెలిసింది.

జీవో విడుదలకు ముందే కొనుగోళ్లు

జీవో విడుదలకు ముందే వైసీపీ నేతలు రంగంలోకి దిగి చాలామంది నుంచి తక్కువ ధరకే భూములు కొనుగోలు చేసి, లబ్ధిపొందారనే విమర్శలు వినిపిస్తున్నాయి.1977 అసైన్డ్ చట్టం ప్రకారం డీపట్టా, బంజరు భూముల కొనుగోలు, విక్రయాలకు అవకాశం లేకపోయినా మంత్రి అనుచరులు, వైసీపీ నాయకులు రైతుల నుంచి కారు చౌకగా కొనుగోలు చేసి, పరిహారం పొందేందుకు జాబితాలో పేర్లు నమోదు చేయించుకున్నారని చెబుతున్నారు. ఎకరా భూమి కేవలం రూ. లక్ష నుంచి రూ.2 లక్షలు లోపే ధర నిర్ణయించి కొనుగోలు చేసినట్టు సమాచారం. అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రం, కోడూరు, గోపాలపురం గ్రామాల పరిధిలో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగాయని చెబుతున్నారు. ఇలా కొనుగోలు చేసిన భూములపై జాబితాలో బినామీ పేర్లను చేర్చి వుడా లేఅవుట్‌లలో రోడ్డు పక్కన విలువైన ప్లాట్‌లు పొందేందుకు యత్నించారని తెలిసింది.

ప్రతిఫలం ఇలా...

రైతుల నుంచి భూములను సమీకరించిన ప్రభుత్వం ప్రతిఫలంగా వారికి ఎకరా జిరాయితీ భూమికి అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో 18 సెంట్లు, ఆక్రమిత భూములు, రైతుల సాగుబడిలో ఉన్న ఎకరా డీ పట్టా భూములకు 9 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తామని పేర్కొంది. వుడా ఆధ్వర్యంలో లేఅవుట్‌లు వేసి రహదారులు, విద్యుత్, తాగునీటి వసతులు వంటి మౌలిక వసతులు కల్పించి, అర్హులకు ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. దీంతో వైసీపీ నేతలు బినామీలు, కుటుంబ సభ్యులకు రోడ్డు పక్కన ప్లాట్‌లు కేటాయించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.

ప్లాట్‌ల కోసం ఎదురుచూపులు

భూ సమీకరణలో భాగంగా ప్రభుత్వానికి భూములు అప్పగించిన రైతులు ప్రతిగా ప్లాట్‌లు అందక మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంచంగి, కూండ్రం పరిసర గ్రామాల వారు తమకు కేటాయించిన భూముల వద్ద నిరసన తెలిపినా అధికారులు స్పందించలేదు. కలెక్టరు, ఆర్డీఓలను వేడుకున్నా ఫలితం కనిపించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు

వైసీపీ, రెవెన్యూ ఉద్యోగులు కుమ్మక్కై సాగించిన అక్రమాలపై విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, భూములిచ్చిన రైతులతో కలిసి గతంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో గత ఏడాది అమరావతిలో సీఐడీ అధికారులకు, డీజీపీకి ఫిర్యాదుచేశారు. సీఐడీ అడిషనల్ డీజీపీ సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అయినా స్పందన రాలేదు. దీంతో కూటమి ప్రభుత్వం దృష్టికి ఈ అక్రమాలను తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్నారు. అప్పట్లో రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారితో పాటు దిగువస్థాయి ఉద్యోగులు అక్రమాల్లో కీలకపాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరుతామని పీలా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలతో పాటు రెవెన్యూ అధికారుల్లో అలజడి రేగుతోంది.

మెరుగైన సేవలు అందించాలి

» డీఎంహెచ్ఓ బాలాజీ



పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ బాలాజీ

పాయకరావుపేట, జూన్ 8 : పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎంఎస్‌వీకే.బాలాజీ పాయకరావుపేట పీహెచ్‌సీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఆసుపత్రిలో రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య, ఇతర సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టు మూర్తి, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యర్రవరంలో సతీష్‌కుమార్ పర్యటన



ఎర్రవరం వార్డు ప్రజలతో మాట్లాడుతున్న సతీష్ కుమార్

ఎలమంచిలి, జూన్ 8 : ఎలమంచిలి నియోజకవర్గంలో తన సోదరుడు, జనసేన పార్టీ అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించిన ప్రజలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం మునిసిపాలిటీలోని ఎర్రవరం వార్డులో ఆయన పర్యటించి, స్థానికులను ఆప్యాయంగా పలుకరించారు. ఎన్నికల ప్రచారంలో మాత్రమే నేతలు కనిపిస్తారని ఆ తరువాత ఎవరూ కనిపించరని అన్న మహిళ వద్దకు వెళ్లి సతీష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం స్థానిక యువతతో ముచ్చటించారు. కూటమి ప్రభుత్వం హయాంలో రాష్ట్రం ఎనలేని పురోగతిని సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నేతలు పల్లా సత్యనారాయణ, కరణం రవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ పండగకు ఏర్పాట్లు



విద్యుత్తు కాంతుల వెలుగులో దుర్గాలమ్మ ఆలయం

సబ్బవరం, జూన్ 8 : సబ్బవరం ప్రజల ఆరాధ్య దైవం దుర్గాలమ్మ పండగను ఈనెల 11న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మూడు రోడ్ల కూడలిలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 4 గంటల నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

మాజీ ఎంపీపీకి ఘన సత్కారం



సత్యనారాయణను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

నక్కపల్లి, జూన్ 8: మాజీ ఎంపీపీ, టీడీపీ నేత దేవర సత్యనారాయణను శనివారం దేవవరం పంచాయతీ టీ డీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో దేవవరం పంచాయతీ నుంచి టీడీపీకి మెజారిటీ రావడంలో కీలక పాత్ర పోషించిన సత్యనారాయణ సేవలను ప్రశంసించారు. ఈ మేరకు పార్టీ నాయకులు కొరిమి సూర్య గణేశ్, పల్లా సూర్యనారాయణ, బత్తుల రమణబాబు, కొరిమి పాపారావు, చిరంజీవి, పైలా సత్యనారాయణ, సత్తిబాబు, రమేశ్, సగిరెడ్డి రాము ఆయన్ని సత్కరించారు.

కట్టుబోలులో మలేరియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దిమిలి పీహెచ్‌సీ సిబ్బంది

రాంబిల్లి, జూన్ 8 : గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరి చేరవని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎ.బాలగంగా శ్రావణి అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కట్టుబోలు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ గ్రామాల్లో నీటి నిల్వలు ఉన్న చోట దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు, సీహెచ్‌ఓ పి.వనిత, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న నేతలు



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న కూటమి నాయకులు

కశింకోట, జూన్ 8 : మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి జయంతిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, భీమరశెట్టి చిన్నికృష్ణ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెదురుపర్తిలో దుర్గాదేవిని దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. ఆలయ కమిటీల సభ్యులు వీరిని కండువా వేసి సత్కరించారు. కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లెల్లో కేంద్ర బలగాల కవాతు

▸▸ కౌంటింగ్ అనంతర పరిణామాలతో అప్రమత్తం

▸▸ అంతా స్నేహభావంతో మెలగాలని సీఐ హరి సూచన



కొత్తఎల్లవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గొలుగొండ, జూన్ 8 : ఎన్నికల కౌంటింగ్ అనంతరం అక్కడక్కడ జరుతున్న పరిణామాల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఇందులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నర్సీపట్నం రూరల్ సీఐ హరి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. కొత్త ఎల్లవరం, పాకలపాడు, చీడిగుమ్మల, సాలికమల్లవరం, జోగంపేట, పప్పుశెట్టిపాలెం గ్రామాల్లో కవాతు జరిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు, కౌంటింగ్‌ను జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించుకున్నామన్నారు. ఇందుకు అంతా సహకరించారని, మున్ముందు కూడా ఇదే వాతావరణం నెలకొనాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో స్నేహభావంతో మెలగాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు నాణ్యమైన విద్య

చీడికాడ, జూన్ 8 : దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వం నాణ్యమైన విద్యనందించనుందని ఎంఈవో కె.బొంజుబాబు తెలిపారు. మండలంలోని తురువోలుతో పాటు పలు గ్రామాల్లో దివ్యాంగ పిల్లలను శనివారం గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పిస్తే వారికి ఆటపాటలతో పలు రకాలుగా తర్ఫీదునిచ్చి తీర్చుదిద్దుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరస్వతి, దేముడుబాబు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం

... 5వ పేజీ తరువాయి

మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. గరుడ, గరుడ ప్లస్, అమరావతి, నైట్ రైడర్, సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, అల్ట్రా డీలక్స్, మెట్రో ఏసీ, వంటి సర్వీస్‌లలో 20 వేల మంది ప్రయాణిస్తున్నారు. సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో, జెఎన్ఎన్‌యూఆర్ఎం సర్వీసుల్లో 1.6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో 80 వేల మంది వరకూ మహిళలు ఉంటారని అధికారుల అంచనా. ఐదు రకాల సర్వీస్‌లలో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఇస్తే ఆ సంఖ్య లక్షకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా. అందుకు తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచుకోవలసిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

అన్ని రూట్లలోను బస్సులుండాలి

మహిళలు ఉచితంగా ప్రయాణించేందుకు వీలుగా అన్ని రూట్లలోను బస్సులు ఉండాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఇప్పటికే అన్ని రీజియన్‌లకు ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇప్పటివరకూ ఆదాయానికి అనుగుణంగా ఆక్యుపెన్సీ అధికంగా ఉన్న రూట్లలో ఎక్కువ బస్సులు, తక్కువగా ఉన్న రూట్లలో తక్కువ బస్సులు నడిపేవారు. కానీ ఇప్పుడు మహిళా ప్రయాణికుల కేంద్రంగా రూట్లలో డిమాండ్ మేరకు బస్సులు కేటాయిస్తూ షెడ్యూలింగ్ చేయాల్సి అవసరం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

హైవేపై ఆశలు!

... 5వ పేజీ తరువాయి

పట్టాలెక్కుతుందని భావిస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్టులో సబ్బవరం నుంచి చోడవరం- నర్సీపట్నం వరకూ 55 కిలోమీటర్ల మేర బైపాస్‌ల నిర్మాణాలు చేపట్టాలని తేల్చారు. నర్సీపట్నం సమీపంలోని చెట్టుపల్లి -చెలంకాయలపాలెం వద్ద 4.1 కిలోమీటర్లు, రోలుగుంట వద్ద 1.15 కిలోమీటర్లు, దొండపూడి- కొత్తకోట మధ్య 5.8 కిలోమీటర్ల బైపాస్, మేడివాడ-రావికమతం వద్ద 5.2 కిలోమీటర్లు, బంగారుమెట్ట నుంచి వడ్డాది మీదుగా చోడవరం గోవాడ వరకూ 14.2 కిలోమీటర్ల బైపాస్, లింగాలతిరుగుడు- ఆరిపాకల మధ్య 2.7 కిలోమీటర్లు, సబ్బవరం నార్త్ బైపాస్‌కు 6.1 కిలోమీటర్లు, సబ్బవరం సౌత్ బైపాస్‌కు 2.6 కిలోమీటర్లు, నర్సీపట్నం బలిఘట్టం వద్ద 5.9 కిలోమీటర్లు, శృంగవరం వద్ద 1.4 కిలోమీటర్లు, కోటనందూరు వద్ద 2.2 కిలోమీటర్లు, డి.పోలవరం వద్ద 1.63 కిలోమీటర్ల బైపాస్ నిర్మాణాలు చేపట్టాలని అప్పట్లోనే రూపకల్పన చేశారు.

1,235 ఎకరాల సేకరణకు నివేదిక

జాతీయ రహదారి నిర్మాణానికి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని అటవీప్రాంతంలో 1,235 ఎకరాల భూములు సేకరించాలని అధికారులు ప్రతిపాదించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో చర్యలు చేపట్టలేదు. తాజాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుకు మోక్షం లభిస్తుందని భావిస్తున్నారు.

భూ సమీకరణలో మాయాజాలం..!

... 5వ పేజీ తరువాయి

డిసెంబరు నెలల్లో కొందరికి ప్లాట్‌లు కేటాయించి చేతులు దులుపుకున్నట్టు తెలిసింది.

వైసీపీ నేతల చేతివాటం

సమీకరణలో భూములు కోల్పోయిన రైతుల జాబితాలో వైసీపీ నేతలు బినామీల పేర్లను చేర్చి, పెద్దఎత్తున లబ్ధిపొందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనకాపల్లి మండలం కోడూరు, కుంచంగి, కూండ్రం, గోపాలపురం, మామిడిపాలెం గ్రామాల్లో అధికార పార్టీ నేతలతో కలిసిపోయిన రెవెన్యూ అధికారులు భూములు లేకుండానే బినామీల పేరుతో లేఅవుట్‌లలో ప్లాట్‌లు పొందేందుకు వీలుగా జాబితాలు రూపొందించారని సమాచారం. అర్హులైన రైతుల జాబితాలను గ్రామ సభల్లో ప్రకటించిన తరువాత సచివాలయాల్లో నోటీసు బోర్డులపై అతికించాలన్నది నిబంధన. కానీ అర్హుల జాబితాను ప్రకటించకుండానే ప్లాట్లు కేటాయించినట్టు తెలిసింది.

జీవో విడుదలకు ముందే కొనుగోళ్లు

జీవో విడుదలకు ముందే వైసీపీ నేతలు రంగంలోకి దిగి చాలామంది నుంచి తక్కువ ధరకే భూములు కొనుగోలు చేసి, లబ్ధిపొందారనే విమర్శలు వినిపిస్తున్నాయి.1977 అసైన్డ్ చట్టం ప్రకారం డీపట్టా, బంజరు భూముల కొనుగోలు, విక్రయాలకు అవకాశం లేకపోయినా మంత్రి అనుచరులు, వైసీపీ నాయకులు రైతుల నుంచి కారు చౌకగా కొనుగోలు చేసి, పరిహారం పొందేందుకు జాబితాలో పేర్లు నమోదు చేయించుకున్నారని చెబుతున్నారు. ఎకరా భూమి కేవలం రూ. లక్ష నుంచి రూ.2 లక్షలు లోపే ధర నిర్ణయించి కొనుగోలు చేసినట్టు సమాచారం. అనకాపల్లి మండలం కుంచంగి, కూండ్రం, కోడూరు, గోపాలపురం గ్రామాల పరిధిలో ఈ అక్రమాలు ఎక్కువగా జరిగాయని చెబుతున్నారు. ఇలా కొనుగోలు చేసిన భూములపై జాబితిలో బినామీ పేర్లను చేర్చి వుడా లేఅవుట్‌లలో రోడ్డు పక్కన విలువైన ప్లాట్‌లు పొందేందుకు యత్నించారని తెలిసింది.

ప్రతిఫలం ఇలా...

రైతుల నుంచి భూములను సమీకరించిన ప్రభుత్వం ప్రతిఫలంగా వారికి ఎకరా జిరాయితీ భూమికి అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో 18 సెంట్లు, ఆక్రమిత భూములు, రైతుల సాగుబడిలో ఉన్న ఎకరా డీ పట్టా భూములకు 9 సెంట్లు స్థలాన్ని కేటాయిస్తామని పేర్కొంది. వుడా ఆధ్వర్యంలో లేఅవుట్‌లు వేసి రహదారులు, విద్యుత్, తాగునీటి వసతులు వంటి మౌలిక వసతులు కల్పించి, అర్హులకు ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. దీంతో వైసీపీ నేతలు బినామీలు, కుటుంబ సభ్యులకు రోడ్డు పక్కన ప్లాట్‌లు కేటాయించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలిసింది.

ప్లాట్‌ల కోసం ఎదురుచూపులు

భూ సమీకరణలో భాగంగా ప్రభుత్వానికి భూములు అప్పగించిన రైతులు ప్రతిగా ప్లాట్‌లు అందక మూడేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో కుంచంగి, కూండ్రం పరిసర గ్రామాల వారు తమకు కేటాయించిన భూముల వద్ద నిరసన తెలిపినా అధికారులు స్పందించలేదు. కలెక్టరు, ఆర్డీఓలను వేడుకున్నా ఫలితం కనిపించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలపై సీఐడీకి ఫిర్యాదు

వైసీపీ, రెవెన్యూ ఉద్యోగులు కుమ్మక్కై సాగించిన అక్రమాలపై విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, భూములిచ్చిన రైతులతో కలిసి గతంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో గత ఏడాది అమరావతిలో సీఐడీ అధికారులకు, డీజీపీకి ఫిర్యాదుచేశారు. సీఐడీ అడిషనల్ డీజీపీ సంజయ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అయినా స్పందన రాలేదు. దీంతో కూటమి ప్రభుత్వం దృష్టికి ఈ అక్రమాలను తీసుకువెళ్లేందుకు యత్నిస్తున్నారు. అప్పట్లో రెవెన్యూ శాఖలో ఉన్నతాధికారితో పాటు దిగువస్థాయి ఉద్యోగులు అక్రమాల్లో కీలకపాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. వారందరిపై చర్యలు తీసుకోవాలని కోరుతామని పీలా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలతో పాటు రెవెన్యూ అధికారుల్లో అలజడి రేగుతోంది.

ఎట్టకేలకు పీఆర్ అతిథి గృహానికి మోక్షం

▸▸ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. రెండు కోట్లతో మంజూరు ▸▸ 2017లో అప్పటి మంత్రి అయ్యన్న శంకుస్థాపన

▸▸ నిర్మాణం పూర్తయి.. ఫినిషింగ్ పనులు పెండింగ్ ▸▸ వైసీపీ అధికారంలోకి రావడంతో బిల్లులు సకాలంలో మంజూరు కాక నిలుపుదల

▸▸ ప్రస్తుతం అయ్యన్న ఎమ్మెల్యేగా గెలుపొందడంతో క్యాంప్ ఆఫీస్‌గా వినియోగానికి తుది మెరుగులకు సన్నాహాలు



నర్సీపట్నంలో అసంపూర్తిగా ఉన్న పీఆర్ అతిథి గృహం

నర్సీపట్నం, జూన్ 8 : ఆరేళ్ల అనంతరం నర్సీపట్నంలోని పంచాయతీ రాజ్ అతిథి గృహానికి మోక్షం లభించనుంది. మండల పరిషత్ కార్యాలయం వెనుక భాగంలో గత టీడీపీ ప్రభుత్వంలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. ఏడాదిన్న కాలంలో భవన నిర్మాణం పూర్తిచేశారు. ఫినిషింగ్ పనులు మాత్రమే మిలిగిపోయాయి. అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో నిధులు విడుదలలో తీవ్ర జాప్యం చేసింది. ఫలితంగా ఆరేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో ఈ భవనాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంగా ఉపయోగించడానికి నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ భవనాన్ని పరిశీలించి వెళ్లారు. మిలిగిలి పనులకు అంచనాలు సిద్ధం చేసి ప్రతిపాదనలు పంపాలని స్థానిక పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఆరేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వం ఈ అతిథి గృహం కోసం కేపిటిల్ అకౌంట్ నుంచి రూ.రెండు కోట్లు మంజూరు చేసింది. 2017లో అప్పటి పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడు శంకుస్థాపన చేశారు. ఏడాదిన్నర కాలంలో భవనం నిర్మాణం చాలా వరకు పూర్తి చేశారు. తలుపులు, కిటికీ డోర్లు, విద్యుత్, శానిటరీ, ఫ్లోరింగ్ టైల్స్ వంటి ఫినిషింగ్ పనులు మిగిలిపోయాయి. కాంట్రాక్టర్ బిల్డింగ్ నిర్మాణానికి రూ.80 లక్షలు ఖర్చు చేశారు. వైసీపీ ప్రభుత్వం రూ.70లక్షలు బిల్లులు చెల్లించింది. మిగిలిన రూ.10 లక్షలు బిల్లు బకాయి ఉండి పోయింది. దీంతో ఫినిషింగ్ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఈ భవనాన్ని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుగా ఉపయోగించేందుకు నిర్ణయం తీసుకోవడంతో మిగిలిన పనులు పూర్తి చేయడానికి పీఆర్ అధికారులు అంచనాలు తయారు చేశారు. సుమారు రూ.60 లక్షలు అవసరం ఉంటుందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ వస్తే పది రోజుల్లో పనులు పూర్తి చేసి అతిథి గృహాన్ని సిద్ధం చేస్తామని అధికారులు అంటున్నారు.

చంద్రబాబు దృష్టికి మీ- సేవా ఆపరేటర్ల సమస్యలు

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



ఎమ్మెల్యే రాజును కలిసిన మీ-సేవా కేంద్రాల ఆపరేటర్లు

చోడవరం, జూన్ 8 : మీ- సేవా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యేగా గెలుపొందిన కేఎస్ఎన్ఎస్ రాజు హామీ ఇచ్చారు. సదరు ఆపరేటర్లు గడచిన ఐదేళ్లుగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో రాజును కలిసి వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన, చంద్రబాబుదృష్టికి తీసుకుని వెళతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం మండలాలకు చెందిన మీ-సేవా ఆపరేటర్ల సంఘం నాయకులు ఎంవీహెచ్ ప్రసాద్, అనంతపల్లి శ్రీను, బైన భవానీశంకర్, అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును శనివారం ఉదయం పట్టణంలోని లక్ష్మీపురం వాకర్స్‌క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి రాంబాబు, జాజుల జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో మౌలిక వసతులు తప్పనిసరి

- త్రిసభ్య కమిటీ పర్యవేక్షణ అనంతరం డీఈవోకు నివేదిక : ఎంఈవో



బుచ్చెంపేటలోని ఓ పాఠశాలలో సౌకర్యాలపై బృందం ఆరా

రోలుగుంట, జూన్ 8 : ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు విధిగా అందుబాటులో ఉండాలని ఎంఈవో జగ్గారావు తెలిపారు. మండలంలోని బుచ్చెంపేట, జె.నాయుడుపాలెం, రోలుగుంట, కుసర్లపూడి తదితర గ్రామాల్లో గల ప్రైవేటు పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలల్లో రన్నింగ్ వాటర్, బెంచీలు, ఉపాధ్యాయులు, స్టాఫ్ రూమ్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు తదితరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిలా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మండలానికి త్రిసభ్య కమిటీని నియమించినట్టు చెప్పారు. సదరు కమిటీ పాఠశాలలను సందర్శించి నివేదికను డీఈవోకు పంపనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్వే బృందం సభ్యులు శెట్టి మోహన్‌రావు, ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కె.గదబపాలెంలో మోదమాంబ పండగ



రావికమతం, జూన్ 8 : టి.అర్జాపురం పంచాయతీ శివారు కె.గదబపాలెంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు మోదమాంబ అమ్మవారి వేడుక జరగనుంది. ఇందుకు సంబంధించి ఆలయ నిర్మాణ ధర్మకర్త, సర్పంచ్ మడగల ఫాల్గుణ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. నెల రోజులుగా వంద మందికిపైగా భక్తులు అమ్మవారి మాల ధారణ చేసి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ మంగళవారం అమ్మవారి అసలు పండగ జరగనుంది. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పరుగు పందెం నిర్వహించనున్నారు. అదే రోజు అమ్మవారి ఘటాల ఊరేగింపు ఉంటుందని సర్పంచ్ ఫాల్గుణ వివరించారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రావికమతం, జూన్ 8 : మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా కొత్తకోటలో శనివారం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ రజనీ మాట్లాడుతూ వర్షా కాలం ఆరంభమైన నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటివి సోకే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి వడబోసిన నీటిని తాగాలని, అనారోగ్య సమస్య తలెత్తితే సమీపంలోని ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మోహిని సురేఖ, ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'2027 నాటికి మలేరియా రహిత రాష్ట్రం కావాలి'

దేవరాపల్లి : మలేరియా 2027 నాటికి రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలన కావాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పూజితా మేఘన అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా శనివారం ఇక్కడ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షా కాలం ఆరంభమైన నేపథ్యంలో అంటువ్యాధుల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్ దృష్టికి

నర్సీపట్నం కోర్టు సముదాయంలో సమస్యలు



వైస్ చైర్మన్‌కృష్ణమోహన్‌ను కలిసిన నర్సీపట్నం సభ్యులు

నర్సీపట్నం, జూన్ 8 : రాష్ట్ర బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా ఎంపికైన కె.కృష్ణమోహన్‌ను స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం విశాఖపట్నంలో మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ నర్సీపట్నం కోర్టు సముదాయంలో ఉన్న పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు, కోర్టు సముదాయంలో మొదటి, రెండో అంతస్తు నిర్మాణం గురించి వివరించారు. అసోసియేషన్ కార్యదర్శి లోకా లోవరాజు. చింతల ప్రకాశ్, సుర్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ వెంకట్రావుకు ఎస్పీ ప్రశంస



కానిస్టేబుల్ వెంకట్రావుకు అవార్డు అందిస్తున్న ఎస్పీ

బుచ్చెయ్యపేట, జూన్ 8 : జిల్లా పోలీస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న బుచ్చెయ్యపేట కానిస్టేబుల్ జి.వెంకట్రావుకు పోలీసు ఉన్నతాధికారుల నుంచి శనివారం ప్రశంసలు అందాయి. ఎన్నికల సమయంలో బుచ్చెయ్యపేట మండలంలోని తన పరిధిలో ఎటువంటి గొడవలు జరగకుండా విధులు నిర్వహించినందుకు గాను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేతుల మీదుగా వెంకట్రావు ప్రశంసా పత్రం, అవార్డును అందుకున్నారు.

రక్తదానం గొప్పది : బత్తుల



దాతలకు పూలమొక్కలు అందిస్తున్న తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, జూన్ 8: రక్తదానం గొప్పదని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చునని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు అన్నారు. బుచ్చెయ్యపేటలో అమ్మ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని రక్తదానానికి ముందుకు రావాల్సిందిగా కోరారు. అనంతరం యాభై మంది రక్తదానం చేయగా వారికి సర్టిఫికెట్లు, పూల మొక్కలను తాతయ్యబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గోకివాడ కటేశ్వరరావు, నాయకులు దొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ఉపాధ్యాయుల బాధ్యత



మొక్కనాటుతున్న ఎంఈవో

చీడికాడ, జూన్ 8 : పాఠశాల ఆవరణలో నాటే ప్రతి మొక్కనూ పెంచేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఎంఈవో కె.బొంజుబాబు సూచించారు. చీడికాడ హైస్కూల్ ఆవరణలో శుక్రవారంవంద మొక్కలను దగ్గరుండి నాటించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఒకొక్కరు కొన్ని మొక్కలను దత్తత తీసుకుని సంరక్షించాలన్నారు.

మాడుగులలో అన్ని బూత్‌లలో సైకిల్‌దే హవా..

మాడుగుల, జూన్ 8 : సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గంలో మళ్లీ టీడీపీ జెండా ఎగరడంతో ఆ పార్టీ శ్రేణుల ఆనందానికి అవధులు లేవు. అందునా మాడుగుల మండలంలోని 69 పోలింగ్ కేంద్రాల్లో సైకిల్ హవా సాగడం వారిని మరింత ఉత్సాహపరిచింది. ఇక్కడ టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తి 7,955ఓట్ల మెజారిటీ సాధించడం విశేషం. బూత్‌ల వారీగా పోలైన ఓట్ల వివరాలు ఇలా ఉన్నాయి. పోలింగ్ బూత్-1లో 836ఓట్లు పోలవ్వగా టీడీపీకి 394 వైసీపీకి 370, 2లో 717కి టీడీపీకి-379 వైసీపీకి 282, 3లో 1033కి 803 ఓట్లు నమోదుకాగ టీడీపీకి - 452, వైసీపీకి - 307, 4పీఎస్‌లో 1007కి 806 పోలవ్వగా, టీడీపీకి- 565, వైసీపీకి - 201, 5లో 1013కి, 818ఓట్లలో టీడీపీకి -572, వైసీపీకి -213, 6లో 485కి 418ఓట్లు నమోదుకాగా టీడీపీకి 244, వైసీపీకి 142, 7లో 789కి 706ఓట్లలో టీడీపీకి 374, వైసీపీకి 279, 8లో 881లో 770 ఓట్లు పోలవగా టీడీపీకి 511, వైసీపీకి 230, 9లో 1077కి 989ఓట్లు నమోదుకాగా టీడీపీకి 564, వైసీపీకి 374, 10లో 1150కి 989ఓట్లు పోలింగ్ నమోదుకాగా, టీడీపీకి 572, వైసీపీకి 300, 11లో 914కి 804ఓట్లలో టీడీపీకి 407, వైసీపీకి 359, 12లో 798కి 685ఓట్లలో టీడీపీకి - 315, వైసీపీకి 322, 13లో 712కి 622ఓట్లలో టీడీపీకి 466, వైసీపీకి 144, 14లో 857కి 696ఓట్లు నమోదుకాగా టీడీపీకి 440, వైసీపీకి - 236, 15లో 1121కి 1028 ఓట్లలో టీడీపీకి 634 వైసీపీకి- 340, 16లో 611కి 531ఓట్లు నమోదుకాగా టీడీపీకి - 259, వైసీపీకి 239 వచ్చాయి. 17లో 596కి 516 ఓట్లలో టీడీపీకి 260, వైసీపీకి 232, 18లో 471కి 402 నమోదైన ఓట్లలో టీడీపీకి 191, వైసీపీకి 172, 19లో 853కి 800 ఓట్లలో టీడీపీకి - 402 , వైసీపీకి 348, 20లో 680కి 541ఓట్లు నమోదుకాగా టీడీపీకి 244, వైసీపీకి 257 వచ్చాయి. 21లో 693కి 558ఓట్లు నమోదుకాగా టీడీపీకి 277 , వైసీపీకి 236, 22లో 962కి 695ఓట్లలో టీడీపీకి 434, వైసీపీకి 239, 23లో 978కి 751ఓట్లలో టీడీపీకి 474, వైసీపీకి 250 పోలయ్యాయి. 24లో 965కి 706ఓట్లలో టీడీపీకి 379, వైసీ పీకి 297, 25లో 799కి 552ఓట్లలో టీడీపీకి 388, వైసీపీకి 135, 26లో 879కి 673 ఓట్లలో టీడీపీకి 428, వైసీపీకి 218 వచ్చాయి. 27లో 373కి 282ఓట్లలో టీడీపీకి 139, వైసీపీకి 121, 28లో 606కి 467ఓట్లు నమోదుకాగా టీడీపీకి 270, వైసీపీకి 162, 29లో 668కి 479ఓట్లు నమోదుకాగా టీడీపీకి 232, వైసీపీకి 225, 30లో 583కి 428ఓట్లు నమోదుకాగా టీడీపీకి 210, వైసీపీకి 188, 31లో 997కి 790ఓట్లలో టీడీపీకి 543, వైసీపీకి 204, 32లో 790కి 591ఓట్లలో టీడీపీకి 357, వైసీపీకి 194 వచ్చాయి. 33లో 753కి 649ఓట్లు నమోదుకాగా టీడీపీకి 399, వైసీపీకి 198, 34లో 738కి 621ఓట్లలో టీడీపీకి 349, వైసీపీకి 215, 35లో 827కి 691ఓట్లలో టీడీపీకి 411, వైసీపీకి 209, 36లో 748కి 711ఓట్లలో టీడీపీకి 395, వైసీపీకి 283 వచ్చాయి. 37లో 676కి 603ఓట్లు నమోదుకాగా టీడీపీకి 295, వైసీపీకి 235, 38లో 761కి 701ఓట్లలో టీడీపీకి 358, వైసీపీకి 308, 39లో 780కి 712ఓట్లలో టీడీపీకి 422, వైసీపీకి 253 వచ్చాయి. 40లో 761కి 675ఓట్లు నమోదుకాగా టీడీపీకి - 447, వైసీపీకి 200, 41లో 827కి 682ఓట్లలో టీడీపీకి 353, వైసీపీకి 292, 42లో 711కి 653ఓట్లలో టీడీపీకి 364, వైసీపీకి 258, 43లో 726కి 661ఓట్లలో టీడీపీకి 299, వైసీపీకి 33944లో 694కి 639ఓట్లలో టీడీపీకి 345, వైసీపీకి 242 వచ్చాయి. 45లో 700కి 613ఓట్లు నమోదుకాగా టీడీపీకి 328, వైసీపీకి - 265, 46లో 657కి 587ఓట్లులో టీడీపీకి 350, వైసీపీకి 219, 47లో 1127కి 974ఓట్లు నమోదుకాగ టీడీపీకి 541, వైసీపీకి 399, 48లో 660కి 581ఓట్లలో టీడీపీకి 290, వైసీపీకి 248, 49లో 1032కి 862ఓట్లు నమోదుకాగా టీడీపీకి 492, వైసీపీకి 313, 50లో 1085కి 898ఓట్లలో టీడీపీకి 467, వైసీపీకి 337, 51లో 770కి 677ఓట్లు నమోదుకాగా టీడీపీకి 367, వైసీపీకి 282 పోలయ్యాయి. 52లో 1060కి 870ఓట్లలో టీడీపీకి 374, వైసీపీకి - 392, 53లో 921కి 776ఓట్లలో టీడీపీకి 371, వైసీపీకి 316, 54 లో 1106కి 955ఓట్లలో టీడీపీకి 576, వైసీపీకి 327, 55లో 695కి 530 ఓట్లలో టీడీపీకి 221, వైసీపీకి 260, 56లో 654కి 442ఓట్లలో టీడీపీకి 241, వైసీపీకి - 180, 57లో 608కి 433ఓట్లలో టీడీపీకి 258, వైసీపీకి 166, 58లో 599కి 455ఓట్లలో టీడీపీకి 274, వైసీపీకి 157, 59లో 641కి 495ఓట్లలో టీడీపీకి 334, వైసీపీకి 135, 60వ పోలింగ్ కేంద్రంలో 579కి 462ఓట్లలో టీడీపీకి 281, వైసీపీకి 155, 61లో 530కి 418ఓట్లలో టీడీపీకి 250, వైసీపీకి 143, 62లో 649కి 505 ఓట్లు నమోదుకాగా టీడీపీకి 323, వైసీపీకి 149, 63లో 852కి 759 ఓట్లు నమోదుకాగా టీడీపీకి 441, వైసీపీకి 285, 64లో 967కి 888ఓట్లలో టీడీపీకి 456, వైసీపీకి 393, 65లో 959ఓట్ల పోలవగా టీడీపీకి 515, వైసీపీకి 400, 66లో 1075కి 866ఓట్లలో టీడీపీకి 466, వైసీపీకి - 350, 67లో 808కి 705ఓట్లలో టీడీపీకి 359, వైసీపీకి 318, 68లో 776కి 688ఓట్లు నమోదుకాగా టీడీపీకి 347, వైసీపీకి 309, 69లో 1197కి 1088ఓట్లు నమోదుకాగా టీడీపీకి 598, వైసీపీకి 407 పోలయ్యాయి. మాడుగుల మండలంలో ఒకటి నుంచి 69 పోలింగ్ బూతులకు సంబంధించి 56వేల 119 మంది ఓటర్లుకు గాను 46వేల 924 ఓట్లు పోలయ్యాయి. టీడీపీకి 26, 7 33 ఓట్లు రాగా, వైసీపీకి 17753 ఓట్లు పోలయ్యాయి. నోటాకి 1025 వచ్చాయి.

రావికమతంలో రెండు చోట్ల మినహా అన్నింటా టీడీపీయే

రావికమతం: మండలంలో రెండుపంచాయతీల మినహా అన్ని పంచాయతీలలోనూ టీడీపీదే హవా కొనసాగింది. మండలంలోని 28 పంచాయతీల పరిధిలో 55,649 ఓటర్లుగాను, 61 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 47,532 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తకోటలో వైసిపికి 2,724 ఓట్లురాగా టీడీపీకి 4,086 ఓట్లు వచ్చి 1362 ఓట్లు మెజార్టీ సాధించింది. మేడివాడలో వైసీపీకి 981,టీడీపీకి 1948 ఓట్లు రాగా 967 మెజారిటీ వచ్చింది. చీమలపాడులో వైసీపీకి 608 ఓట్లు రాగా టీడీపీకి735 ఓట్లు వచ్చి 127 ఓట్లు మెజారిటీ లభించింది. జెడ్.కొత్తపట్నంలో టీడీపీకి 648, వైసీపీకి 409, దర్మవరంలో టీడీపీకి 171, వైసీపీకి90, గంపవానిపాలెంలో టీడీపీకి 618, వైసీపీకి 558, (జెడ్.బెన్నవరం పంచాయతీ) కిత్తంపేటలో టీడీపీకి 601, వైసీపీకి 458,దొండపూడిలో టీడీపీకి 1469, వైసీపీకి 988, కన్నంపేటలో టీడీపీకి 520, వైసీపీకి 369, వమ్మవరం టీడీపీకి 534, వైసీపీకి 302, మర్రివలస టీడీపీకి 532,వైసీపీకి 357, మత్స్యవానిపాలెం 415టీడీపీకిరాగా,వైసీపీకి 438,పి.పొన్నవోలు టీడీపీకి 1004,వైసీపీకి 728, టి.అర్జాపురంలో టీడీపీకి 2017, వైసీపీకి 1040 వచ్చాయి.

అలాగే, కొట్నాబిల్లి టీడీపీకి 359, వైసీపీకి284, కవ్వగుంట టీడీపీకి 367, వైసీపీకి 303, కెబిపి అగ్రహారం టీడీపీకి 373, వైసీపీకి 257, కొమిర టీడీపీకి 312,వైసీపీకి 365, చినపాచిల టీడీపీకి 1134, వైసీపీకి 664, గుమ్మాళ్ళపాడు టీడీపీకి 633, వైసీపీకి 312, రావికమతం టీడీపీకి 1752,వైసీపీకి1122, గర్నికం టీడీపీకి 602, వైసీపీకి 410, మరుపాక టీడీపీకి 1148, వైసీపీకి 946, గుడివాడ టీడీపీకి 1281, వైసీపీకి 688, గుడ్డిప టీడీపీకి 954, వైసీపీకి 535, గొంప టీడీపీకి 901, వైసీపీకి 583, తట్టబంద టీడీపీకి 1009, వైసీపీకి 697 ఓట్లు వచ్చాయి.

24 పంచాయతీల్లో ఓటర్లు కూటమి అభ్యర్థికే పట్టం

రోలుగుంట: మండలంలోని 24 పంచాయతీల ఓటర్లు కూటమి అభ్యర్థికే మద్దతు పలికారు. 43 పోలింగ్ బూత్ లల్లో 37698 మంది ఓటర్లు ఉండగా, 33135 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండల వ్యాప్తంగా కూటమికి 6652 ఓటర్ల మెజారిటీ అందించారు. పంచాయతీలవారీగా ఇరుపార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు ఉన్నాయి. ఎంకేపట్నంలో వైసీపీకి 335, టీడీపీకి 415 ఓట్లు రాగా టీడీపీకి మెజారిటీ 170 వచ్చింది. అలాగే బీబీపట్నంలో వైసీపీకి 427, టీడీపీకి 522 ఓట్లు రాగా టీడీపీ మెజారిటీ 95, రత్నంపేటలో వైసీపీకి 642, టీడీపీకి 916 రాగా టీడీపీకి మెజారిటీ 274, శరభవరంలో వైసీపీకి 961, టీడీపీకి 1085 రాగా టీడీపీకి మెజారిటీ 124 వచ్చింది. వడ్డిపలో వైసీపీకి 458, టీడీపీకి 513 ఓట్లు రాగా టీడీపీకి మెజారిటీ 95, బుచ్చెంపేటలో వైసీపీకి 802, టీడీపీకి 1299 ఓట్లు రాగా టీడీపీకి 497 మెజారిటీ వచ్చింది. నిండుగొండలో వైసీపీకి 477, టీడీపీకి 734 రాగా మెజారిటీ 257, ఎన్.కొత్తూరులో వైసీపీకి 386, టీడీపీకి 638 రాగా మెజారిటీ 252, కె.నాయుడుపాలెంలో వైసీపీకి 692, టీడీపీకి 824 రాగా మెజారిటీ 132, కొవ్వూరులో వైసీపీకి 678 రాగా టీడీపీకి 814 మెజారిటీ 136, కొంతలంలో వైసీపీకి 578, టీడీపీకి 986 రాగా మెజారిటీ 408 వచ్చింది.

అలాగే, అడ్డసరంలో వైసీపీకి 334, టీడీపీకి 531 రాగా మెజారిటీ 197, కంచుగుమ్మలలో వైసీపీకి 313, టీడీపీకి 528 మెజా రిటీ 215, రోలుగుంటలో వైసీపీకి 965, టీడీపీకి 2005 ఓట్లు రాగా మెజారిటీ 1040 వచ్చింది. కొండపాలెంలో వైసీపీకి 544, టీడీపీకి 755 మెజారిటీ 211, కుసర్లపూడిలో వైసీపీకి 708, టీడీపీకి 1462 ఓట్లు రాగా మెజారిటీ 754 వచ్చింది. జానకిరాంపురంలో వైసీపీకి 586, టీడీపీకి 718 మెజారిటీ 132, జేపీ అగ్రహారంలో వైసీపీకి 393, టీడీపీకి 516 రాగా మెజారిటీ 123, కొమరవోలులో వైసీపీకి 358, టీడీపీకి 1193 ఓట్లు రాగా మెజారిటీ 835, బలిజిపాలెంలో వైసీపీకి 703, టీడీపీకి 1099 మెజారిటీ 396, జగ్గంపేటలో వైసీపీకి 1032, టీడీపీకి 1330 రాగా మెజారిటీ 298 వచ్చింది.

క్రైం... crime news

క్వారీ నుంచి జారిపడి కార్మికుడి మృతి


పల్లెల రామోజీ (ఫైల్)

కొత్తూరు, జూన్ 8: మండలంలోని కుంచంగి గ్రామంలో సర్వే నంబరు 281లో రాయి క్వారీ నుంచి జారి పడి రోజు వారీ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కుంచంగి గ్రామానికి చెందిన పల్లెల రామోజీ (48) రోజూ మాదిరిగానే శనివారం కూడా రాయి క్వారీలో పని నిమిత్తం వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో రామోజీ క్వారీ నుంచి ప్రమాదవశాత్తు జారి పడిపోయాడని తెలిపారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమవడంతో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారన్నారు. ఈ మేరకు మృతుడు భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

పది మద్యం బాటిళ్లతో వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, జూన్ 8: పది మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ బి. రామకృష్ణ తెలిపారు. విజయరామరాజుపేటకు చెందిన పిట్ల కుమార్ మద్యం దుకాణంలో బాటిళ్లు కొనుగోలు చేసి ఇంటికి తీసుకు వెళుతుండగా విజయరామరాజుపేట జంక్షన్ వద్ద పట్టుకున్నట్టు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

ముగిసిన హాకీ శిక్షణ శిబిరం


క్రీడాకారులతో హాకీ అసోసియేషన్ నేతలు థామస్ పీటర్, రవిరాజ్, నరేష్

ఎలమంచిలి, జూన్ 8: స్థానిక రాజీవ్‌గాంధీ క్రీడా మైదానంలో 38 రోజులు పాటు నిర్వహించిన హాకీ సమ్మర్ కోచింగ్ క్యాంపు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హాకీ అసోసియేషన్ ట్రెజరర్ థామస్ పీటర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవిరాజ్ మాట్లాడుతూ ఎలమంచిలిలో హాకీ క్రీడాకారులకు మరింత తర్ఫీదు ఇవ్వడం అభినందనీయమన్నారు. రానున్న టోర్నీలో క్రీడాకారులంతా విశేష ప్రతిభ కనబరిచేందుకు ఈ శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హాకీ అధ్యక్షుడు ఆడారి వీరునాయుడు, జిల్లా కార్యదర్శి కొరారు నరేష్, ట్రెజరర్ నరసింగరావు, వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, ఏబీఎల్.రాజు, వేగి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

జి.కొత్తూరులో స్తంభాల పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చీడికాడ, జూన్ 8 : కోనాం శివారు గుంటుకొత్తూరు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలు గాలివానకు కూలిపోవడంతో శనివారం సదరు సిబ్బంది వాటిని పునరుద్ధరించారు. ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీవర్షానికి రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ సమస్యను 'ఆంధ్రజ్యోతి' ప్రచురించడంతో విద్యుత్ శాఖ ఏఈ నమ్మి వెంకటరావు వెంటనే స్పందించారు. కూలిన వాటి స్థానంలో కొత్త స్తంభాలను దగ్గరుండి వేయించి సమస్యను పరిష్కరించారు.

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలైన్లు

సింహాచలం, జూన్ 8 : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేసవి సెల వులు ముగియనుండడంతో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు ఒడిశా, తెలంగాణ నుంచి వందలాది మంది వచ్చారు. దీంతో వేకువజాము నుండే కొండదిగువ దేవస్థానం బస్టాండ్‌లోనూ, భైరవస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలోనూ భక్తుల రద్దీ కనిపించింది. తొలుత కొండదిగువ వరాహ పుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు భైరవస్వామిని దర్శించుకుని అమృత కలశాల మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకుని, స్వామివారిని దర్శించుకున్నారు.

కుర్చీలు వదలని వైసీపీ నేతలు

... 5వ పేజీ తరువాయి

పెట్టుబడుల ప్రాంతం (పీసీపీఐఆర్) ఛైర్‌పర్సన్ పదవి ముందు చొక్కాకుల వెంకటరావు భార్య లక్ష్మీకి ఇచ్చారు. ఇటీవల పదవీ కాలం ముగిసిపోగా నేరుగా వెంకటరావునే ఆ సీట్లో కూర్చోబెట్టారు. ఆయన కూడా ఇంకా పదవికి రాజీనామా సమర్పించలేదు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ పదవి తొలుత కొండా రాజీవ్‌గాంధీ సోదరికి ఇచ్చారు. ఆరు నెలల క్రితం పదవీకాలం ముగిసిపోగా నేరుగా ఆయనకే అప్పగించారు. ప్రతిపక్షంపై దుమ్మెత్తిపోయడమే ప్రధాన విధిగా మొదటి నుంచి ఆయన పనిచేసుకుంటూ వస్తున్నారు. ఆ విధంగానే పార్టీ పెద్దల దృష్టిలో పడి...అదే పంథా కొనసాగించారు. ఇంకా పదవి పట్టుకొని వేలాడుతున్నారు.

విశాఖపట్నం పార్టీ సమన్వయకర్తగా ఎంపీ విజయసాయిరెడ్డి ఉన్నప్పుడు పరవాడకు చెందిన గెడ్డం ఉమకు మహిళా కమిషన్ డైరెక్టర్ పదవి ఇచ్చారు. పార్టీకి చేసిన సేవలు ఏమిటంటే...స్థానిక నాయకులకే ఆమె తెలియదనేది క్షేత్రస్థాయిలో వినిపించే మాట. ట్విట్టర్ (ఎక్స్) వేదికగా జగన్‌ను పొగడడం, పార్టీ పెద్దలు వచ్చినప్పుడు విమానాశ్రయానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు ఇవ్వడమే ఆమె చేసిన సేవ అని చెబుతున్నారు. ఇంకా రాజీనామా చేయలేదు.

ఇకపోతే కార్పొరేషన్లు, వివిధ విశ్వవిద్యాలయాలలో డైరెక్టర్లుగా, వివిధ దేవస్థానాలకు ట్రస్టు బోర్డు సభ్యులుగా పలువురు పదవులు తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలాంటి పదవులు పొందిన వారి సంఖ్య వంద వరకూ ఉంటుంది. వారంతా వైసీపీ ఓడిపోయిన వెంటనే రాజీనామా చేయాలి. కానీ ఇంకా పదవులు పట్టుకుని వేలాడుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	450
విజయనగరం	454
శ్రీకాకుళం	454

క్రికెట్ స్టేడియంపైనా వైసీపీ పెద్దల కన్ను?

- అందుకోసమే భోగాపురంలో 300 ఎకరాల్లో ప్రపంచస్థాయి స్టేడియం నిర్మిస్తామంటూ ప్రకటనలు
- పీఎం పాలెం స్టేడియం భూమి వెనక్కి తీసుకునే ఆలోచన
- 24 ఎకరాలకు టెండర్.. ఓడిపోవడంతో బెడిసి కొట్టిన ప్రణాళిక


పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియం స్థలం కొట్టేయాలని వైసీపీ పెద్దలు ప్లాన్ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ స్టేడియానికి సీఎం హోదాలో జగన్మోహన్‌రెడ్డి రెండుసార్లు వచ్చారు. జాతీయ రహదారిని ఆనుకుని...పరిపాలనా రాజధాని ఏర్పాటుచేయాలనుకున్న కోర్ ఏరియా రుషికొండకు సమీపాన ఉండడంతో పూర్వాపరాలపై ఆరా తీశారు. మొత్తం 24 ఎకరాల్లో విస్తరించిన ఉన్న స్టేడియం స్థలం ప్రభుత్వానిదేనని, విశాఖ జిల్లా క్రికెట్ సంఘానికి (వీడీసీఏ) లీజుకు ఇచ్చారని తేలింది. దాంతో వారిని అక్కడి నుంచి ఖాళీ చేయించి, ఆ విలువైన భూమిని అస్మదీయులకు కట్టబెట్టాలని వ్యూహం రచించారు.

ట్రాఫిక్ ఇబ్బందులనే వంక

పీఎం పాలెం స్టేడియంలో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించినప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోందని, జాతీయ రహదారి పక్కనే ఉండడంతో సమస్యలు వస్తున్నాయని ప్రచారం ప్రారంభించారు. పనిలో పనిగా ప్రస్తుత ఏసీఏ కార్యవర్గంతో ఆధునిక వసతులతో కూడిన భారీ స్టేడియం నిర్మాణానికి భూమి కేటాయించాలనే ప్రతిపాదన తెరపైకి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి తరహాలో పెద్ద స్టేడియం నిర్మిస్తామని కార్యవర్గం చెబితే...'ఫ్యూచర్ ఆఫ్ విశాఖ' పేరుతో రాడీసన్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాటి సీఎం జగన్ మాట్లాడుతూ, ప్రపంచస్థాయి స్టేడియం 300 ఎకరాల్లో నిర్మిస్తామని ప్రకటించారు. దీనికి భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపాన స్థలం ఎంపిక చేసినట్టుగా ప్రచారం చేశారు. వారు అనుకున్నది అనుకున్నట్టుగా జరిగితే భోగాపురం సమీపాన కొత్త స్టేడియం నిర్మించి, పీఎం పాలెం స్టేడియం భూమిని వెనక్కి తీసుకోవాలనేది ఆలోచనగా తెలిసింది.

కొన్నాళ్ల క్రితమే లీజు కాలం పొడిగింపు

పీఎం పాలెం క్రికెట్ స్టేడియం గురించి కార్యవర్గంలో పనిచేసిన వారిని సంప్రతించగా అది ప్రభుత్వ భూమేనని, తొలుత 30 ఏళ్ల లీజుకు వీడీసీఏకు ఇచ్చారని, ఆ గడువు ముగిసిపోవడంతో మళ్లీ దానిని ఇంకో 30 ఏళ్లకు పొడిగించారని తెలిపారు. భోగాపురం సమీపాన కొత్త స్టేడియం నిర్మిస్తే...ఇక ఇక్కడ స్టేడియం ఎందుకనే వంకతో లీజును రద్దు చేసి భూమిని వెనక్కి తీసుకునే అవకాశం లేకపోలేదని అనుమానం వ్యక్తంచేశారు. క్రికెట్ అభిమానులకు అన్యాయం జరగకుండా జనం ఆ పార్టీని ఓడించి మంచి పని చేశారని మరొకరు వ్యాఖ్యానించారు.

శాంతిభద్రతల గురించి జగన్ మాట్లాడడం విడ్డూరం

- మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద

తుమ్మపాల, జూన్ 8: శాంతిభద్రతల కోసం జగన్‌రెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలపై మాట్లాడే హక్కు జగన్‌రెడ్డి కోల్పోయారన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులు, కక్షసాధింపు చర్యలు, ఆస్తుల నష్టం, హత్యలు వంటి దుష్పాలనకు తెర తీసిన ఏకైక వ్యక్తి జగన్‌రెడ్డి అని అన్నారు. బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలను దెబ్బ తీసి వారి జీవితాలతో ఆటలాడుకున్నారన్నారు. జగన్‌రెడ్డికి పోలీసులు, కోర్టులు అంటే భయం లేదన్నారు. సీబీఐ 11 కేసులు, ఈడీ ఆరు కేసుల్లో గత పదేళ్లుగా 3086 సార్లు వాయిదాలు కోరిన ఘనుడు జగన్‌రెడ్డి అని అన్నారు. కేవలం తన ఒంటెద్దు పోకడ, నియంతృత్వ ధోరణి కారణంగానే రాష్ట్ర ప్రజలంతా తరిమికొట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ పదవికి దిలీప్‌కుమార్ రాజీనామా

తుమ్మపాల, జూన్ 8: ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు (ఏపీఐడబ్ల్యూఏ) చైర్మన్ పదవికి దంతులూరి దిలీప్‌కుమార్ శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఆంధ్రప్రదేశ్ మౌలిక వసతులు, పెట్టుబడుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి అందజేశారు. భవిష్యత్తులో జగన్ వెంటే ఉంటానని ఆయన చెప్పారు.

రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటు

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్

కొత్తూరు, జూన్ 8: రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు ఒక వ్యక్తి కాదని శక్తి అని అభివర్ణించారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. రామోజీరావు వ్యాపారాల్లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా మొక్కవోని దీక్షతో విజయపథంలో నడిపించిన మహా వ్యక్తి అని పేర్కొన్నారు. 2016లో భారత ప్రభుత్వం రామోజీరావును దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మవిభూషణ్‌తో సత్కరించడం ఆయన పరిపూర్ణత్వానికి నిదర్శనమన్నారు.

మోదకొండమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

- 18న మాడుగులలో వేడుక


జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, కమిటీ సభ్యులు

మాడుగుల, జూన్ 8: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ జాతరకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 18వ తేదీన ఈ వేడుక జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి చేతులమీదుగా కమిటీ సభ్యులు శనివారం ఆయన నివాసానికి వెళ్లి ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర విజయవంతానికి 13వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారని కమిటీ సభ్యులు ఇక్కడి విలేకరులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నవరానికి కాలినడకన టీడీపీ పట్టణ అధ్యక్షుడు


పాయకరావుపేట నుంచి పాదయాత్రగా వెళుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు

పాయకరావుపేట, జూన్ 8: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత అధిక మెజారిటీతో గెలుపొందిన నేపథ్యంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు శనివారం పాయకరావుపేట నుంచి కాకినాడ జిల్లా అన్నవరం వీరవెంకటసత్యనారాయణస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో మంగవరంరోడ్డులోని సీతారామాలయం నుంచి అన్నవరం పాదయాత్రగా బయలుదేరిన పెదిరెడ్డి శ్రీను వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెదిరెడ్డి శ్రీను మాట్లాడుతూ టీడీపీ అధిష్ఠానం వంగలపూడి అనితకు టికెట్ ప్రకటించినప్పుడే ఆమె గెలిస్తే అన్నవరం సత్యనారాయణస్వామి ఆలయానికి పాదయాత్రగా వస్తానని మొక్కుకున్నానన్నారు. తాను అనుకున్నట్టుగానే అనిత అత్యధిక మెజారిటీతో గెలుపొందినందున పాదయాత్ర చేపట్టానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, మలిపెద్ది వెంకటరమణ, పల్లా విలియంకేరి, లెక్కల గోవిందు, గుల్లా నాగరాజు, వేములపూడి అప్పారావు, కశింకోట సత్తిబాబు, ఎం.దుర్గాప్రసాద్ తదితరులున్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో...

పాయకరావుపేట రూరల్ : జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురంలో భారీ మెజారిటీతో గెలుపొందడంతో మండలంలోని పీఎల్.పురం జనసేన నాయకులు, కార్యకర్తలు శనివారం గ్రామం నుంచి అన్నవరం వీరవెంకటసత్యనారాయణస్వామి ఆలయాన్ని పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ శ్రేణులు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురంలో భారీ మెజారిటీతో గెలుపొందాలని మొక్కుకున్నామని, అనుకున్నది నెరవేరడంతో పాదయాత్రగా వెళుతున్నామన్నారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆశీస్సులతో బయలుదేరామన్నారు.

కొంపముంచిన బెట్టింగ్

- వైసీపీ ఓటమితో రూ.కోట్లు పోగొట్టుకున్న నాయకులు, కార్యకర్తలు
- గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గ్రామంలో భారీగా సాగిన పందాలు
- పందెంలో వాహనాలు, భూములు కోల్పోయిన కొందరు

విశాఖపట్నం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ఓటమితో ఆ పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు రూ.కోట్లు నష్టపోయారు. జగన్ మరోసారి అధికారంలోకి వస్తారంటూ ఉమ్మడి విశాఖ జిల్లాలో పందాలు కాసినవారంతా మునిగిపోయారు. వైసీపీ విజయంపైనా, రాష్ట్రంలో ఆ పార్టీకి వచ్చే అసెంబ్లీ/ఎంపీ సీట్లపైనా, ఇంకా జిల్లాలో వచ్చే సీట్లు, కొన్ని నియోజక వర్గాల్లో అభ్యర్థులు సాధించే మెజారిటీలపైనా ఈ పందాలు సాగాయి. ఒక్కో గ్రామంలో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కనీసం రూ.పది లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ పందాలు కాశారు. అయితే వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూడడంతో అంతా నష్టపోయారు. నగర పరిధిలోని ఓ ముఖ్య నాయకుడు అనుచరుడు రూ.12 లక్షలు పందెం కాశాడు. తమ నాయకుడు గెలుస్తాడని బెట్టింగ్ వేయగా, ఆయన ఓటమిపాలయ్యారు. అలాగే, పార్టీలతో సంబంధం లేకుండా ఈ ఎన్నికల్లో ఎంతోమంది పందాలు కట్టారు. అయితే కూటమిపై కాసిన వారికి కాసుల వర్షం కురవగా, వైసీపీ వైపు కాసిన వారికి కన్నీళ్లే మిగిలాయి.

చేతులు మారిన కోట్లాది రూపాయలు

ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు ఉత్తరాంధ్రలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి రూ.కోట్లు బెట్టింగ్ సాగింది. ఈ మూడు జిల్లాల్లో సుమారు వెయ్యి నుంచి రెండు వేల కోట్లు బెట్టింగ్ జరిగి ఉంటుందని చెబుతున్నారు. కొన్నిచోట్ల వాహనాలు, భూములను కూడా పందాల్లో పెట్టారు. ముఖ్యంగా కీలక నాయకులు విజయాలపై పెద్ద మొత్తంలో పందాలు కాశారు. శ్రీకాకుళం, పలాస, నరసన్న పేట, పాతపట్నం, ఎచ్చెర్ల, చీపురుపల్లి, గజపతినగరం అసెంబ్లీ సెగ్మెంట్లతోపాటు విజయనగరం ఎంపీ సీటుపై వైసీపీ కార్యకర్తలు ఎక్కువగా పందాలు కాశారు. చీపురు పల్లిలో బొత్సపై రెండు, మూడు రెట్లు అదనంగా ఇచ్చి పందాలు కాసిన వారంతా మునిగిపోయారు. ఆ షాక్ నుంచి ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితిలో ఉన్నారు. అలాగే నగర పరిధిలో ఓ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి లభించే ఓట్లపై పందాలు సాగాయి. అలాగే నగరంలో 'నార్త్', 'వెస్ట్', అనకాపల్లి జిల్లాలో మాడుగుల నియోజక వర్గాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుస్తారని ఆ పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు భారీగా పందాలు కాశారు. కానీ మూడు చోట్ల ఓడిపోవడంతో లక్షలు పోగొట్టుకున్నారు. పందాలు కాసిన వారంతా పార్టీ ఓటమి కంటే తమ డబ్బు పోయి నందుకే ఎక్కువ బాధపడుతున్నారు.

రాకేష్‌రెడ్డి, పద్మశ్రీలను సస్పెండ్ చేయాలి

- జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న మీసాల సుబ్బన్న

అనకాపల్లి టౌన్, జూన్ 8: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై అసత్య ఆరోపణలు చేసిన పార్టీ నాయకులు రాకేష్ రెడ్డి, సుంకర పద్మశ్రీలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న, అధికార ప్రతినిధి జి. వెంకటరావు, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ జి. శ్రీనివాసులు మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలుగా షర్మిల ఎన్నికల్లో అలుపెరగని పోరాటం చేసిందన్నారు. ఆమె పీసీసీ పగ్గాలు చేపట్టిన దగ్గర నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, పార్టీ విజయానికి కృషి చేశారన్నారు. గతంతో పోల్చితే ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. షర్మిల పోరాట పటిమ కారణంగానే వైసీపీ అధినేత జగన్ ఓటమి చెందారన్నారు. ఆమె ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం కానుందన్నారు. ఆమెతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బోయిన భానుమూర్తియాదవ్, కె. అప్పారావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, పీఎస్ దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నను దర్శించుకున్న డీఎంహెచ్‌వో


డీఎంహెచ్‌వో దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు

నక్కపల్లి, జూన్ 8: మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామిని అనకాపల్లి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) బాలాజీ దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారి పేరును అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి వివరించారు. ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాన్ని బహూకరించి, వేద ఆశీర్వచనం చేశారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ కూడా ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు.

అంగన్‌వాడీ కందిపప్పులో పురుగులు

- వండిన పప్పును తీసుకువచ్చి చూపించిన బాలింత


పూడిమడక అంగన్‌వాడీ కేంద్రం -2 పరిధిలో వండిన కందిపప్పు

అచ్యుతాపురం రూరల్, జూన్ 8: బాలింతలకు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సరుకుల్లో నాణ్యత కరువైంది. తమకు ఇచ్చిన కందిపప్పులో పురుగులు కనిపించాయని పూడిమడక అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బాలింతలు అసహనం వ్యక్తం చేశారు. శనివారం తాము కందిపప్పు వండగా పురు గులు వచ్చాయని, వండిన పప్పును అంగన్ వాడీ కేంద్రానికి తీసుకువచ్చి ఆయాకు చూపించారు. అంగన్‌వాడీ కార్యకర్త సెలవులో ఉన్నారని ఆయా చెప్పడంతో బాలింత వెనుదిరిగింది. ఫ్రిజ్‌లో పెట్టి సోమవారం కార్యకర్తకు చూపిస్తామని బాలింత చెప్పింది. అలాగే ప్రభుత్వం అందించే గుడ్లు, పాలు, కందిపప్పు పంపిణీలో పర్యవేక్షణ లేకపోవడంతో కార్యకర్తలు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు ఆమె తెలిపారు.

ఇసుక అక్రమ నిల్వలపై దాడులు

- రెండు చోట్ల స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది


పోలవరం వద్ద ఇసుక నిల్వను పరిశీలిస్తున్న ఎస్ఐ షేక్ రహీం

గొలుగొండ, జూన్ 8: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ నిల్వలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు చీడిగుమ్మలలో గల మద్యం షాపు వద్ద, పోలవరం గ్రామం వద్ద నిల్వ చేసి ఉంచిన ఇసుక గుర్తించారు. అనంతరం వాటిని స్థానిక వీఆర్‌వోలకు అప్పగించినట్టు ఎస్ఐ షేక్ రహీం తెలిపారు.